అంతర్వు వసారాలో కదులుతున్న ఆమె ఓ యువతిగా తెలుస్తున్నది.

పాడుతూ పాడుతూ.. ఆమె హఠాత్తుగా కిందికి చూసింది.

ఆ నిశీధివేళ రాజ ప్రాసాదాల మధ్య డొంకలో నిలబడ్డ వారెవ్వరో తననే చూస్తున్నట్లు ఆమె గుర్తించినట్లు..

వెనువెంటనే పాడటం ఆపేసి, రెండు ఘడియలు 'ఎవరా!?' అన్నట్లు పరికించి చూసి లోపలికి వెళ్లిపోయింది.

ఆ వసారాలో నిశ్శబ్దం నిలబడిపోగా.. దీనంగా వెలుగుతున్నది ఆముదపు కాగడా.

మరునాడు ఉదయాన్నే ఆ భవంతిలో ఎవరు ఉంటారో తెలుసుకున్నాడు జాయపుడు.

నారాంబ అంతఃపురంలో పిల్లల సంరక్షణ పరిచారిక పున్నాగను అడిగాడు. ఆమె తన అక్క అక్కడే పనిచేస్తున్నదని చెప్పింది. మరునాడు ఆమె గురించి పూర్తి వివరాలు తెలియజేసింది.

ఆ భవంతిలో కిందిభాగంలో ఒకరు.. పైభాగంలో ఒకరు నివాసం ఉన్నారు. పైభాగంలో కాకతీయ పూర్వ రాజు బేతరాజు అన్నదమ్ములలో ఒకరైన సిద్ధయదేవుని మునిమనవడు.. ఆయన కూడా సిద్ధయ దేవుడన్న పేరున్నవాడే అక్కడ నివశిస్తున్నాడు. ఆయనకు ఉన్నది ఏకైక కుమార్తె అని.. ఆమె పేరు ఇంద్రాణిదేవి అని.. ఆమె గాయనీమణి అని కూడా పున్నాగ చెప్పింది.

మరునాడంతా జాయపుడు ఆ భవనం వైపే చూస్తూ తిరుగాడాడు. ఎవరికైనా అనుమానం రావచ్చునన్న భావనతో నాగంభట్టు ఇచ్చిన కొత్త తాళగ్రంథాలలో ఒకటి చేతిలో పెట్టుకుని తాళపత్రాలను అటూ ఇటూ తిప్పుతూ గడిపాడు. కానీ, లక్ష పర్యాయాలు తల ఎత్తి అటు చూసి చూసి మెడ పట్టేసింది కానీ.. పగలంతా ఎవ్వరూ ఆ మొదటి అంతర్వు వసారాలో కనిపించలేదు.

కానీ ఆమె గానం.. అందులోని శాస్త్రీయత.. అంతకు మించి ఆమె స్వరంలోని గాఢత అతణ్ని వదిలిపెట్టడం లేదు. అది కూడా నిశిరాత్రి వేళ రాజ ప్రాసాదమంతా నిద్రించిన సమయాన.. మొదటి అంతర్వు నుంచి పాడటం చేత, ఆ స్వరమాధుర్యం నిర్నిద్ర నిశీధిని చుట్టుకుని కాగడా వెలుతురులో కమ్ముకుని.. గాలికి ఏదో పరిమళాన్ని అద్ది.. నక్షత్రాల మెరుపులను ఆహ్వానించి తనకు అందించినట్లు.. ఏవో కొత్త జిలుగులు తన కళాత్మక గుండె లయలకు అద్దినట్లు!

పగలంతా ఆ పరిమళంలోనే మగతగా పడి ఉన్నాడు.

మరలా రాత్రి కాగానే.. అక్కకు సందేహం కలగకుండా, అక్క-బావలతో భోజనాలు కానిచ్చి, మళ్లా వచ్చి డొంకల్లో తిరుగాడాడు. అతనెంత ఒంటరిగా ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తూ ఆ రంధిలో ఉన్నా ఓ రక్షక భటుడు అతణ్ని అనుసరిస్తున్నాడు.

ఆరోజు జాయపునికి ఎదురొచ్చి పలకరించాడు.

''జాయప సేనాని.. ఏమి ఈ డొంకలలో తచ్చాడుతున్నారు?'' అన్నాడు.

వాణ్ని అబ్బురంగా చూశాడు జాయపుడు. కారణం వాడు తన మానసిక స్థితిని.. శరీర కదలికలను స్పష్టంగా చెప్పడం!

ఏమిటన్నాడూ.. తచ్చాడుతున్నాననే కదా!? భలే.. మంచిమాట వాడాడు వెధవ! నిజమే. శరీరమూ మనసు కూడా ఎక్కడెక్కడో.. తచ్చాడుతున్నది!

''భేష్! బాగా గుర్తించావోయ్!'' అంటూ వాణ్ని మెచ్చుకుంటూ.. మరేదో అనబోయాడు.

వాడు ఏమాత్రం తన ప్రవర్తనను మార్చుకోలేదు.

''వద్దు స్వామీ.. ఈ డొంకల్లో ఈ రాత్రి వేళ తచ్చాడటం బాగాలేదు!''.

ఓరి వెధవా.. తచ్చాడటానికి మరో మంచి అర్థం స్ఫురింపజేశావోయ్.. ముచ్చటపడి మరేదో అనబోయాడు.

ఈసారి కూడా వాడు ఏమాత్రం చలించకుండా..

''లోపలికి వెళ్లండి స్వామి! నాకు ఇబ్బంది..'' అన్నాడు.

అరె.. మళ్లీ మరో మంచి పదం.. ఇబ్బంది! నిజమే నిజమే.. తాను ఇలా రాత్రుళ్లు భవనాల వసారాల్లోకి చూస్తూ తిరుగుతుంటే కాపలాదారులకు ఇబ్బందే కదా.

జాయప ఏమీ అనకుండానే.. మళ్లీ వాడే అన్నాడు.

''నేను కేవలం కాపలాదారుణ్ని. మరి కాసేపటికి గూఢచారులు వస్తారు. తమర్ని ఏమీ అనరు కానీ.. నన్ను వొంగోబెట్టి గుగ్గిలం వేస్తారు..'' అన్నాడు.

వాడి మాటల్లో ఎలాంటి భావాలూ లేవు. వాడి స్వరంలో ఎలాంటి ఆరోహణ అవరోహణలూ లేవు. కేవలం భయం మాత్రమే ఉంది.

లోపలికి వెళ్లకపోతే శూలంతో బెదిరించి లోపలికి తోసేలా ఉన్నాడు. మన గౌరవానికి భంగం కలగకుండా మనమే వెళ్లిపోతే బాగుంటుంది. ఏమీ చేయలేక పకపకా నవ్వేసి వెనుదిరిగాడు.

జాయపుడు వెనుదిరగగానే ఆ కాపలాభటుడు ముందుకు సాగిపోయాడు.

జాయపుడు వెళ్లకుండా పక్కగా నక్కి.. వెనక్కి వచ్చి ఆ అంతర్వు వంక చూడసాగాడు.

కానీ, అప్పుడే ఆ అంతర్వు వసారాలో వెలుగు.. చటుక్కున ఆగిపోయి చూశాడు.

ఆమె.. ఆమె చటుక్కున మెరిసింది. ఈసారి ఆమె కాగడా పట్టుకుని మరీ వసారాలోకి వచ్చింది. వస్తూ ఏదో రాగ ప్రస్తారం.. పెదవులు విప్పకుండా చేస్తున్న సంగీత గిలిగింతలు.. పిల్లిమొగ్గలు!

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ జాయపుడు మెల్లగా భవంతి దగ్గరగా వెళ్తుంటే.. ఆమె ఉన్నట్టుండి ఓ పాట అందుకుంది.



**జాయపుడు వెళ్లకుండా పక్కగా నక్కి.. వెనక్కి వచ్చి ఆ అంతర్వు వంక చూడసాగాడు. కానీ, అప్పుడే ఆ అంతర్వు వసారాలో వెలుగు.. చటుక్కున ఆగిపోయి చూశాడు. ఆమె.. ఆమె చటుక్కున మెరిసింది. ఈసారి ఆమె కాగడా పట్టుకుని మరీ వసారాలోకి వచ్చింది. వస్తూ ఏదో రాగ ప్రస్తారం.. పెదవులు విప్పకుండా చేస్తున్న సంగీత గిలిగింతలు.. పిల్లిమొగ్గలు!**

''రేయి.. రేయి.. గోరువెచ్చని ఈ రేయి..''

ఆపి మళ్లీ మళ్లీ.. గొంతెత్తి.. రాగం మార్చి.. శ్రుతి మార్చి.. మరో రాగంలో.. కాసేపు తచ్చాడింది.

కాసేపు నిశ్శబ్దం..

''రేయి.. రేయి.. గోరువెచ్చని ఈ రేయి..
మరి మరీ ముద్దొస్తుందోయి.. మన రేయి..
మనిద్దరి రేయి..''

మళ్లీ మళ్లీ రాగాలు మార్చుకుంటూ.. శ్రుతులు మార్చుకుంటూ.. పాటకు పదం తర్వాత పదం పొదుగుతూ, ఆ భావానికి, సందర్భానికి, వాక్యాలకు తగిన రాగాన్ని కూర్చడానికి పాడుతూ అటూ ఇటూ తిరుగుతూ.. తన ఊహాలోకాలలో తన సాహిత్య, సంగీత సమ్మిళిత ప్రపంచంలో మునకలు వేస్తున్నది.

గురుకులంలో మాత్రమే ఇలాంటి కవులను, గాయకులను చూశాడు. పాట కట్టడం దానిని రాగయుక్తం చెయ్యడానికి ఆపసోపాలు పడటం.. కవనంలో, సంగీతంలో వారివారి ప్రావీణ్యాన్ని బట్టి ఆ పాట కొత్త సొబగుల్ని సంతరించుకోవడం చూశాడు. అబ్బురంగా ఆస్వాదించాడు.

ఇప్పుడు ఈ రాజప్రాసాదంలో ఓ అమ్మాయి అలాంటి కవి గాయకురాలు.. ఎదురవ్వడం జాయపకు మధురంగా ఉంది.

చైతన్యం సర్వ భూతానాం నిర్వృతి ర్జగదాత్మనాం ।
నాదబ్రహ్మ తదానంద మద్వితీయ ముపాస్మహే ॥

(సర్వభూతాత్మకమైన సర్వ జగత్తుకు మూలమై చైతన్యవంతమైన ఆ నాదబ్రహ్మకు నమస్కరిస్తున్నాను)

అన్ని కళల్లోకి ఆది కళ గానమే! అక్షరం, మాట రూపు దిద్దుకోకముందే.. మనిషి పుట్టుక నుంచే సంగీతం ఉంది. అదే కూనిరాగం. కూనిరాగమే తొలి రాగం. శుద్ధ సంగీతమే ఆదికళ. పదం లేదా మాట అంటే ఓ భావం. పథం అంటే బాట. ఓ భావం ప్రవహించే దారి లేదా పథమే సంగీతం. మాట ఓ పథం వెంట పయనిస్తే అది గానం లేదా పారాయణం. వేద పఠనమే సంగీత సాహిత్య సమ్మిళితమైన పాటకు లేదా సంగీతానికి తొలి నిర్దిష్ట రూపం.

వేద ప్రవచనం ఉచ్చరించడంలోనే నాలుగు రకాల నాదస్థాయిలు ఉంటాయి. ఉదాత్త (సాధారణ స్థాయి), అనుదాత్త (తక్కువ స్థాయి), ప్రవిత (పై స్థాయి), దీర్ఘ ప్రవిత (పైపై స్థాయి).

అందులో మళ్లీ పదకొండు ఉచ్చారణ విధానాలు.. సంహిత, పద, క్రమ, జట, మాల, శిఖ, రేఖ, ధ్వజ, దండ, రథ, ఘన.

అవి ఒకదాని కంటే ఒకటి కష్టతరమైనవి. అన్నిటిలో ఆఖరిదైన 'ఘనము' అనే పద్ధతి చాలా క్లిష్టమైనది.

దానిపై పట్టుసాధించిన వారిని 'ఘనపాఠి' అంటారు. ఈ పద్ధతిలో వేదాన్ని నేర్చుకోవాలంటే కనీసం వెయ్యి సార్లు అయినా పఠించాలి. సంహిత అంటే రెండు అక్షరాలు కలిపి పలకాలి.. పాడాలి. పద అంటే మరో పద్ధతి..

అలాగే జట.. మాల..

అబ్బో ఇవన్నీ కలిసి కూర్చుని చర్చించుకుంటూ కబుర్లు చెప్పుకొంటుంటే భలే రసానందంగా ఉంటుంది. కానీ, ఇక్కడ ఇద్దరు ఆడ, మగ కలిసి కూర్చున్నారా.. చచ్చారన్నమాటే. ఆ సంగతి చక్రవర్తివారి వరకూ వెళ్తుంది. కాదు కాదు.. మునుముందు ఆయన వద్దకే వెళ్తుంది. అది జాయపునికి అనుభవమయ్యింది కూడా..

(సశేషం)